క్లుప్తంగా

ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

రాపూరు : పోలి పాడ్యమి సందర్భంగా సోమవారం రాపూరులోని రామనాథేశ్వర స్వామి ఆలయంలోని ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు రామనాథేశ్వరశర్మ మాట్లాడుతూ కార్తీక మాసంలో 30 రోజులపాటు ధ్వజ స్తంభానికి ఆకాశ దీపం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్తీక మాసం పూర్తయిన తర్వాత ధ్వజ స్తంభానికి పూజలు చేయడం ఆచారమని పేర్కొన్నారు. అందుకుగాను ధ్వజ స్తంభానికి ప్రత్యేక అలంకరణ చేసి శాంతిపూజ జరిపించినట్లు తెలిపారు.

ఘనంగా గౌరీదేవికి కుంకుమ పూజ



కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

ఓజిలి: మండలంలోని మానమాల గ్రామంలోని బాబా మందిరంలో మార్గశిర పూర్ణిమ సందర్భంగా సోమవారం గౌరీదేవికి కుంకుమ పూజను ఘనంగా నిర్వహించారు. మందిర నిర్మాణ కర్తలు ఉచ్చూరు శోభారాణి, హరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబాకు విశేష పూజలు చేశారు. వేద పండితులు నార్నిపాటి హరికృష్ణశర్మ మహిళలతో గౌరీ వ్రతం చేయించారు. మహిళలకు నాయుడుపేట మండలం మేనకూరు గ్రామానికి చెందిన కట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, సాయి సుజనారెడ్డి దంపతులు అన్నదానం చేశారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న హెచ్‌ఎం, ట్రస్టు ప్రతినిధులు

చిల్లకూరు : కోట మండలానికి చెందిన కురుగొండ్ల కరుణ ఉన్నత చదువులకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు సోమవారం రూ.20 వేలు సాయం చేశారు. చిల్లకూరు మండలం పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థినికి చెక్కు అందజేశారు. హెచ్‌ఎం బండ్ల సుధాకర్ మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ చదివేందుకు స్థోమత లేక విద్యార్థిని ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకుని ట్రస్టు ప్రతినిధులు ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఆయన రూ.20 వేల సాయం చేసేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. ట్రస్టు ప్రతినిధులు బాబు, ఉపాధ్యాయులు గ్రంథం మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, చంద్రశేఖర్, సుబ్రమణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు పంపిణీ



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

గూడూరు రూరల్ : గూడూరు రెండో పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం బహుమతులు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి పి.విజయ్ మహేష్, రెడ్ రిబ్బన్ కోఆర్డినేటర్ పీరా కుమార్, అధ్యాపకులు ఝాన్సీ, నారాయణరాజు, లక్ష్మీ, మైమూన్, కోటేశ్వరరావు, రవి, రాజు, హిమబిందు, కిరణ్మయి, శ్రీధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మల్లాంలో ప్రత్యేక పూజలు



స్వామి, అమ్మవార్లకు నిర్వహిస్తున్న పల్లకీ సేవ

చిట్టమూరు(చిల్లకూరు) : కార్తీక మాసం తర్వాత వచ్చే అమావాస్య సందర్భంగా మల్లాంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో రాత్రి రంగవళ్లులతో భారీ శివలింగం ఆకారాన్ని తీర్చిదిద్దారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లకు పల్లకి సేవ, నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో శశాంక్, నాయకులు మునిశేఖర్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేతాజీనగర్‌లో అర్ధంతరంగా ఆగిపోయిన అంగన్‌వాడీ భవనం



సిద్ధాపురం ఎస్టీ కాలనీలో పిల్లర్ల దశలోనే ఆగిపోయిన అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం



గోడలకే పరిమితం

- నిర్మాణ దశలోనే అంగన్‌వాడీ భవనాలు
- సరైన వసతులు లేక చిన్నారుల అష్టకష్టాలు
- పట్టించుకోని అధికారులు

ఐదేళ్లలోపు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోంది. దొరవారిసత్రం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన భవనాలు, వసతులు లేకపోవడంతో పిల్లలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. భవనాలు ఉన్న చోట నీటి వసతి, విద్యుత్ సదుపాయం లేవు. కొన్నిచోట్ల అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. తగినంత గాలి, వెలుతురు లేకపోవడంతో పిల్లలు చీకటిలోనే మగ్గుతున్నారు. పలు కేంద్రాలకు సొంత భవన నిర్మాణాలు చేపట్టినా అర్ధంతరంగా ఆగిపోయాయి. వాటిని ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పే నాథుడు లేక అరకొర వసతులున్న గదుల్లోనే కేంద్రాలను నెట్టుకొస్తున్నారు.

దొరవారిసత్రం : మండలంలో 55 మెయిన్, 9 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మూడేళ్లలోపు చిన్నారులు 2,315 మంది, గర్భిణులు 210 మంది, బాలింతలు 267 మంది సేవలు పొందుతున్నారు. పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో వారి ఇబ్బందులు అంతా ఇంతా కాదు. మరికొన్ని కేంద్రాలకు కొత్తగా భవనాలు మంజూరు చేసినా ఫలితం లేదు. నేటికీ నిర్మాణ దశలోనే ఉన్నాయి. ముఖ్యంగా నేతాజీనగర్, వేలికాడు, సిద్ధాపురం, బేరిజంగాపల్లి, చవటకండ్రిగ, కట్టువాపల్లి, బూదూరు, మేలనాలత్తూరు, నెల్లూరుపల్లి, వెదురుపట్టురాజుపాళెం, నెలబల్లి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు భవన వసతి లేదు. కొన్నిచోట్ల అద్దె భవనాల్లో, మరి కొన్నింటిని అందుబాటులో ఉన్న పాఠశాల భవనాల్లో అతికష్టం మీద నడుపుతున్నారు. భవన వసతి ఉన్నప్పటికీ చిన్నారులకు అవసరమైన తాగునీరు, విద్యుత్ సదుపాయం లేకపోవడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వసతులు కల్పించాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేదని కార్యకర్తలు వాపోతున్నారు.

కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి

బేరిజంగాలపల్లి, నేతాజీనగర్, మైలాంగం, సిద్ధాపురం, వెదురుపట్టురాజుపాళెం తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు గతంలో భవనాలు మంజూరు చేశారు. నిధుల కొరతతో ఏళ్ల తరబడి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సిద్ధాపురం, వెదురుపట్టురాజుపాళెం ఎస్టీ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల నిర్మాణ పనులను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టారు. తర్వాత వాటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. కారికాడు, బూదూరు, పూలతోట ఎస్సీ, కల్లూరుకండ్రిగ తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్ర భవనాలు క్రమేపి దెబ్బతింటూ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని పిల్లలు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



బేరిజంగాపల్లిలో కొన్నేళ్లుగా నిర్మాణ దశలోనే ఉన్న అంగన్‌వాడీ భవనం

> **కొత్తగా ప్రతిపాదనలు పంపాము**
>
> దొరవారిసత్రం మండలంలో వివిధ దశల్లో ఆగిపోయిన అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కొత్తగా ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయి. అన్ని వసతులతో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మిస్తాం. నిర్మాణ పనులు పీఆర్ శాఖ పర్యవేక్షణలో చేపడతారు.
>
> - శారదాంబ, సీడీపీవో, ఐసీడీఎస్ సూళ్లూరుపేట ప్రాజెక్ట్



వేలికాడు ఎస్సీ కాలనీలో భవన వసతి లేక పాఠశాల భవనంలో ఉన్న చిన్నారులు



నేతాజీనగర్‌లో పాడుబడిన అద్దె ఇంటిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

గూడూరు రూరల్ : వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే కేంద్ర సహకార బ్యాంకు లక్ష్యమని గూడూరు శాఖ మేనేజర్ హరిత తెలిపారు. ఆమె సోమవారం బ్యాంకు ఆవరణలో ఖాతాదారులకు బ్యాంకులో అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తాము కేంద్ర సహకార బ్యాంకుతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పీఏసీఎస్‌ల ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. బ్యాంకు అత్యధిక డిపాజిట్లుపై 333 రోజులకు 7.40 శాతం, 444 రోజులకు 7.50 శాతం, 555 రోజులకు 7.60 శాతం వడ్డీ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లకు 0.50 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 0.75 శాతం అదనంగా ఇస్తామన్నారు. వ్యవసాయ, గృహ, చిరు వ్యాపారులకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. సిరాస్థి, బంగారు ఆభరణాల తాకట్టు, ఉన్నత చదువులకు రుణాలు ఇస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు సరిత, పద్మ, ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామానాయుడు, నారాయణరెడ్డి, మల్లీశ్వరయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

వెంకటగిరి రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. ఆయన సోమవారం వెంకటగిరి పట్టణంలోని సుదర్శనం నగర్ సచివాలయంలో స్థానికుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు, పక్కాగృహాలు మంజూరుకు కసరత్తు చేస్తోందని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కండలేరులో 54.018 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 4.018 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి 3,300 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 2,150 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 800, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 45 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపుతో పేదలపై పెనుభారం



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతోపాటు విద్యుత్ చార్జీల పెంపుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలపై పెనుభారం మోపుతున్నారని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఆయన సోమవారం వాకాడులోని తన స్వగృహంలో చిట్టమూరు, కోట, వాకాడు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలను అమాంతం పెంచారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అక్రమ కేసులపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. అంతేగాక కార్యకర్తల్లో ధైర్యం నింపేందుకు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నియోజకవర్గంలోనూ పర్యటించనున్నారని వివరించారు. సమావేశంలో నాయకులు కొడవలూరు దామోదరరెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, గూడూరు వెంకటేశ్వరరెడ్డి, తూపిలి మధురెడ్డి, నెల్లూరు పెంచలరెడ్డి, పాపారెడ్డి రాజశేఖరరెడ్డి, వాకాటి రవి, పార్థసారథి పాల్గొన్నారు.

ఉయ్యాలమ్మ ఆలయంలో చోరీ

నాయుడుపేట టౌన్ : మండలంలోని పూడేరు గ్రామ దేవత ఉయ్యాలమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు సోమవారం ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఆదివారం ఆలయం వద్ద గ్రామ పొంగళ్లు పెట్టామన్నారు. సాయంత్రం అమ్మవారిని బంగారు ఆభరాణాలతో అలంకరించినట్టు వెల్లడించారు. రాత్రి తాళాలు వేసినట్టు తెలిపారు. దుండగులు అర్ధరాత్రి ఆలయ తలుపులు పగులగొట్టి అమ్మవారి మెడలోని తాళిబొట్టు, ఆభరణాలు, హుండీలోని కానుకలను చోరీ చేసినట్టు తెలిపారు. హుండీని పొలాల్లో పడేవారని తెలిపారు. పోలీసులు ఆలయాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణముఖి నదిలో పెరుగుతున్న వరద ప్రవాహం



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేట టౌన్ : తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో స్వర్ణముఖి నదిలో ప్రవాహం పెరుగుతోంది. సోమవారం కూడా వర్షం కురవడంతో స్వర్ణముఖి నది నీటి ప్రవాహం కాజ్‌వేను తాకింది. మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా అక్కడికి వెళ్లి పరిశీలించారు. నది వద్దకు ఎవరూ వెళ్లకుండా సీఐ బాబీ, తహసీల్దార్ రాజేంద్ర ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అదే విధంగా మండలంలోని మామిడి కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది.

కార్యకర్తలకు అండగా ఉంటాం



నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి : వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన సోమవారం రాత్రి ఓజిలి, కురుగొండ, మానమాల గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులను కలిశారు. అదే విధంగా ఓజిలి గ్రామానికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు విష్ణువర్ధన్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనవరి నుంచి ప్రజలతో మమేకం కానున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతోందని ఆరోపించారు. చంద్రబాబు ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్‌లో తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. గ్రామాల్లో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల కన్వీనర్ హరనాథ్‌రెడ్డి, ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి, ఎం.రవీంద్రరెడ్డి, జి.శ్రీధర్‌రెడ్డి, ఎ.దిలీప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుబ్బారావుయాదవ్, ప్రభాకర్‌రాజు, పృథ్వీకుమార్, అనీల్‌కుమార్, రవి, ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.

వరి పైరును ముంచిన వరద

పెళ్లకూరు : ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, గుంతలు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని వరి పైర్లు నీట మునిగాయి. పలుచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. పెళ్లకూరు, చిల్లకూరు, కొత్తూరు, జీలపాటూరు, పాలచ్చూరు, శిరసనంబేడు, చెంబేడు, పునబాక, భీమవరం తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా వరి పైర్లు దెబ్బతిన్నాయి. పెళ్లకూరు, చిల్లకూరు, దొడ్లవారిమిట్ట, కప్పగుంటకండ్రిగ, కిష్టప్పకండ్రిగ, యడపూడి, పునబాక, చెంబేడు గ్రామాల్లోని దళిత కాలనీల్లో అంతర్గత రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చవటకండ్రిగ, ఎగువతాగేలి, పాలచ్చూరు గిరిజన కాలనీల చుట్టూ ఉన్న పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. స్వర్ణముఖి నదిలో వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కలవకూరు, పిడికిటిమాల, యడపూడి, అనకవోలు, పెరుమాళ్లపల్లి, జంగాలపల్లి, పాలచ్చూరు, దిరసనమాల, కప్పగుంటకండ్రిగ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

ఏడాదిగా పొలంలోనే ట్రాన్స్‌ఫార్మర్

- మరమ్మతులు చేయని ట్రాన్స్‌కో అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



తుంగమడుగు సమీపంలో పొలంలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

దొరవారిసత్రం : గత ఏడాది డిసెంబర్‌లో మిఛాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని తుంగమడుగు సమీపంలోని పొలంలోని త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ స్తంభాలతో కూడా నేల కూలింది. దాన్ని సరిచేయాలని రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఐదుగురు రైతులు సుమారు 35 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. పంటలు ఎండిపోకుండా ఉండేందుకు పక్కనే ఉన్న మరో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. లోడ్ ఎక్కువ కావడంతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ అవుతోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి కింద పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేయాలని కోరుతున్నారు.

జల దిగ్బంధంలో గ్రామాలు

చిల్లకూరు/కోట/చిట్టమూరు (చిల్లకూరు) : గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిల్లకూరు, కోట మండలాల్లోని ఉప్పుటేరు, మామిడి కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉప్పుటేరు వరద నీరు తిప్పగుంటపాళెం సమీపంలోని బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తుండడంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చిల్లకూరు తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది వరద ప్రవాహాన్ని పరిశీలించి హెచ్చరికలు జారీ చేశారు. ఎంపీడీవో గోపి పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, వేణుగోపాల్ నాయుడుతో కలిసి గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కోట మండలంలోని మామిడి కాలువ వల్ల రుద్రవరం గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. చలి తీవ్రత పెరగడంతో తీరప్రాంత గ్రామాలైన కొత్తపట్నం, గోవిందపల్లి, సిద్దవరం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 5,00 హెక్టార్లలో వరి పంట నీట మునిగినట్లు ఏవో నిరంజన్‌కుమార్ తెలిపారు. ఊనుగుంటపాళెం, రుద్రవరం, గూడలి, తిన్నెలపూడి, వంజివాక, అల్లంపాడులో వరినాట్లు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. చిట్టమూరు మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలు గ్రామాల్లో సుమారు 1,000 ఎకరాల్లో వేసిన వరినాట్లు ఐదురోజులుగా నీటిలోనే ఉన్నాయి. నారు కుళ్లిపోతుందని, మరోసారి పైర్లు వేసుకోవడానికి ప్రభుత్వం విత్తనాలను ఉచితంగా అందజేయాలని రైతులు కోరుతున్నారు.



దొరవారిసత్రం : మినమనముడి గ్రామ సమీపంలో పూర్తిగా మునిగిపోయిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి

నిండిపోయిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జీలు

దొరవారిసత్రం: మండలంలో కురిసిన భారీ వర్షాలకు మినమనముడి సమీపంలో ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి, చందనముడి-పిండిపాళెం గ్రామాల మధ్య నెర్రికాలువపై ఉన్న బ్రిడ్జి మునిగిపోవడంతో మూడు రోజులుగా రాకపోకలు ఆగిపోయాయి.



దొరవారిసత్రం : చందనముడి-పిండిపాళెం గ్రామాల మధ్య మునిగిపోయిన బ్రిడ్జి



చిల్లకూరు : ఉప్పుటేరు వరద నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో గోపి

రేపు జువ్వలపాళెంలో అయ్యప్ప అఖండ జ్యోతి



హోమం నిర్వహిస్తున్న అయ్యప్ప సేవా సంఘం నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : మండలంలోని జువ్వలపాళెంలో బుధవారం అయ్యప్ప స్వామి అఖండ జ్యోతి పూజోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొప్పాల సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం హోమంతో ఉత్సవాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. మంగళవారం గ్రామంలోని ఆలయాల సముదాయం సమీపంలో ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం అయ్యప్పస్వామి అఖండ జ్యోతి పూజోత్సవం, స్వామి వార్ల నగరోత్సవం, అన్నదానం చేపడతామని తెలిపారు.

వైభవంగా మెట్ల పూజ

సైదాపురం : మండల కేంద్రమైన సైదాపురంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం రాత్రి 18 మెట్ల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఉభయకర్తగా ఆవుల సాంబశివయ్య వ్యవహరించారు.



మెట్లు పూజలు చేస్తున్న దృశ్యం